
పండగ వేళ.. అప్రమత్తం

సంక్రాంతి సందడి మొదలైంది. కొత్త వస్త్రాలు, ఇతర షాపింగ్‌లతో ప్రజలు బిజీ బిజీగా ఉన్నారు. ఉద్యోగ, ఉపాధి నిమిత్తం పట్టణ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా పండగకు సొంత ఊళ్లు వెళ్తారు. ఇదే అదనుగా దొంగలు చేతివాటం చూపిస్తుంటారు. ఈ తరుణంలో అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. ఊళ్లకు వెళ్లేవారు తమకు ముందే సమాచారం ఇవ్వాలని.. ఎల్‌హెచ్‌ఎంఎస్(లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్) ఉపయోగించుకుని పండగ నిశ్చింతగా చేసుకోవాలని సూచిస్తున్నారు.

– సెలవుల నేపథ్యంలో చోరీలను కట్టడి చేయడానికి పోలీసుల ప్రణాళిక





మదనపల్లె సిటీ: పండగ నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. మదనపల్లెలో ఇటీవల చోరీలు ఎక్కువయ్యాయి. సంక్రాంతికి సెలవులు ఇవ్వడంతో చాలామంది తమ సొంత ఊళ్లకు వెళ్తారు. ఈ నేపథ్యంలో నేరాల నియంత్రణపై పోలీసులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఊరికి వెళ్లే వారంతా తమ ఇంటి చిరునామా సంబంధిత పోలీస్ స్టేషన్‌లో తెలియజేయాలి. ఎప్పుడు ఊరు వెళ్తారు? ఎప్పుడు తిరిగి వస్తారు? తేదీలతో సహా తెలపాలి. ఇంటి యజమాని ఫోన్ నెంబర్ అందజేయాలి. లేదా వాచ్‌మెన్‌ను నియమించుకోవాలి.

అపార్ట్‌మెంట్లలో భద్రత తప్పనిసరి

అపార్ట్‌మెంట్లలో ఉన్న వారు వాచ్‌మెన్‌ను తప్పకుండా ఏర్పాటుచేసుకోవాలి. అతడి ఫొటో, అడ్రస్ తీసుకోవాలి. కొత్తవారు వచ్చేటప్పుడు వాచ్‌మెన్ ప్రశ్నించేలా అప్రమత్తం చేయాలి. రిజిష్టర్‌లో వారి పేరు, అడ్రస్, ఫోన్ నెంబర్, ఎక్కడికి వెళ్తున్నారు? వివరాలు నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలి. అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో, ప్రవేశ ద్వారం, కారిడార్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. ఇళ్లలో ఎక్కువ మొత్తంలో సొమ్ము, బంగారం, వెండి, అభరణాలు ఉంచరాదు. బ్యాంకు లాకర్లలో భద్రపరచుకోవాలి. సెల్లార్లలో, ప్రవేశద్వారం, కారిడార్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. ఇళ్లలో ఎక్కువ సొమ్ము, బంగారం, వెండి అభరణాలు ఉంచరాదు. బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవాలి.

ప్రయాణాల్లోనూ అప్రమత్తత అవసరం

ప్రయాణాల్లో విలువైన వస్తువులు బ్యాగుల్లో పెట్టకండి. చిన్న పిల్లలు, బ్యాగులను ఎక్కడ పెడితే అక్కడ వదిలిపెట్టి వెళ్లకండి. షాపింగ్ చేసే వారు పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలి. డబ్బుతో కూడిన బ్యాగులు ఉన్నప్పుడు జాగ్రత్తగా పట్టుకోవాలి. రద్దీగా ఉన్న చోట జేబు దొంగలు, బంగారు వస్తువులు దొంగలించేవారు ఉంటారు. చుట్టుపక్కల వారిని గమనిస్తుండాలి. కరెన్సీ నోట్లు కిందపడేసి, మీ దృష్టిని మరల్చి విలువైన వస్తువులు తెచ్చుకున్నప్పుడు డబ్బు కాజేసే అవకాశం ఉంటుంది. డిజిటల్ లావాదేవీలకే ప్రాధాన్యం ఇవ్వాలి. వీలైనంత వరకు నగదు రహిత లావాదేవీలకు మొగ్గుచూపాలి.

చోరీలకు చెక్



సంక్రాంతికి సొంత ఊళ్లకు వెళ్లేవారు తప్పకుండా తమ సమాచారాన్ని పోలీస్ స్టేషన్‌లో అందజేయాలి. లేదా పోలీస్ యాప్ ఎల్‌హెచ్‌ఎంఎస్‌ను ఉపయోగించుకోవాలి. దీంతో ఆ ప్రాంతాల్లో అదనపు సిబ్బందిని నియమించి చోరీలకు చెక్ పెట్టవచ్చు. షాపింగ్ చేసే సమయంలో నగదు, బంగారు వస్తువుల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. అత్యవసరమైతే డయల్ 100, 1090 నంబర్లకు ఫిర్యాదు చేయాలి. పండగ సంతోషంగా జరుపుకోవాలి.

–ఏరిషావలి, సీఐ, వన్‌టౌన్ పోలీస్ స్టేషన్, మదనపల్లె

ప్రధాని మోదీకి రాష్ట్రంలో పర్యటించే అర్హత లేదు


గో బ్యాక్ మోదీ అంటూ నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

మదనపల్లె: ఆంధ్ర ప్రదేశ్‌ను నిట్ట నిలువునా ముంచిన ప్రధాని నరేంద్ర మోదీకి రాష్ట్రంలో పర్యటించే అర్హత లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు అన్నారు. ఈ నెల 8న మోదీ పర్యటనను నిరసిస్తూ పట్టణంలోని మార్కెట్ యార్డు వద్ద సీపీఎం ఆధ్వర్యంలో గో బ్యాక్ మోదీ అంటూ నిరసన తెలిపారు. శ్రీనివాసులు మాట్లాడుతూ విభజన చట్టంలో భాగంగా కడప ఉక్కు పరిశ్రమను రూ.20 వేల కోట్లతో నిర్మించి లక్ష మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని పదేళ్లుగా చెప్పిన బీజేపీ ఇప్పుడు తమ పరిశీలనలో లేదని చేతులెత్తేసిందన్నారు. రాష్ట్ర విభజన హామీలు అమలు చేయకుండా, వెనుకబడిన ప్రాంతాలకు నిధులివ్వకుండా మోసం చేస్తోందన్నారు. విశాఖ ఉక్కును కాపాడేందుకు రెండేళ్లుగా కార్మికులు పోరాడుతున్నా.. విశాఖ పట్టణానికి ప్రధాని రావడం ఆంధ్రులను అగౌరవపరచడమే అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్విభజన చట్టం- 2014 ప్రకారం కడపలో భారీ ఉక్కు పరిశ్రమ నిర్మిస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందన్నారు. 16 డిమాండ్లతో కూడిన రాయలసీమ డిక్లరేషన్‌ను బీజేపీ ప్రకటించినా, ఒక్కటీ అమలు చేయకుండా ద్రోహం చేసిందన్నారు. బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ ఇస్తామని చెప్పి.. ఏడు జిల్లాలకు మాత్రమే ఏటా రూ.50 కోట్లు ఇచ్చి దగా చేసిందన్నారు. ఐఐఐటీ, రైల్వే కోచ్ నిర్మాణ పరిశ్రమ, తిరుపతిలో కండలేరు ప్రాజెక్టు, చిత్తూరులో చెన్నై- ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు హరిశర్మ, నాగరాజు, నరసింహ, జయబాబు, శ్రీరాములు, నాగరాజ, పాపిరెడ్డి, రమణ పాల్గొన్నారు.

హిందూ ధర్మ పరిరక్షణకు కృషి చేద్దాం

మదనపల్లె: హిందూమతంలో తారతమ్యాలు, కులభేదాలు లేకుండా.. అందరినీ ఏకతాటిపైకి తెచ్చేందుకు, ధర్మ పరిరక్షణకు కృషి చేయాలని అఖండ నవభారత్ నిర్మాణ్ అధ్యక్షుడు వి.నారదరెడ్డి అన్నారు. మంగళవారం ఆ సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జనవరి 5న విజయవాడలో జరిగిన హైందవ శంఖారావం విజయవంతం కావడంపై హిందూ బంధువులకు కృతజ్ఞతలు తెలిపారు. దేశంలోనే తొలిసారిగా ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన కార్యక్రమం హిందూ బంధువులందరి ఐక్యతను చాటిందన్నారు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించినప్పుడు హిందూ దేవాలయల భూములు 15 లక్షల ఎకరాలు ఉండేవన్నారు. ఇప్పుడు కేవలం 5 లక్షల ఎకరాలు ఉన్నాయన్నారు. దాదాపు 10 లక్షల ఎకరాల భూములు అన్యాక్రాంతమయ్యాయన్నారు. వాటిని తిరిగి హిందూ దేవాలయాలకు అప్పగించేలా ప్రభుత్వాలు చొరవ చూపాలన్నారు. అఖండ నవభారత్ నిర్మాణ్ ఆధ్వర్యంలో హిందూ జాతి మనుగడ కోసం గ్రామగ్రామాన పర్యటించి, హిందూ సమాజ పరిరక్షణకు పాటుపడటమే కాకుండా, ప్రచార రథాన్ని ఏర్పాటు చేసుకుని, హిందువుల్లో చైతన్యం తీసుకువచ్చి కులాలకు అతీతంగా అందరినీ ఏకతాటిపైకి తెచ్చేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు గంగిరెడ్డి, నారాయణ, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

2న బ్రాహ్మణ ఉచిత వివాహ వేదిక


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

మదనపల్లె సిటీ: వేంకట గాయిత్రీ బ్రాహ్మణ ఉచిత వివాహ వేదిక ఫిబ్రవరి 2న నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ధర్మాధిపతి నాగభూషణ రావు తెలిపారు. స్థానిక జ్ఞానోదయ పాఠశాలలో వివాహ వేదిక కరపత్రాలను మంగళవారం ఆవిష్కరించారు. తిరుపతి వినాయక నగర్‌లోని కంచిపాదుక మండపంలో వివాహ వేదిక జరుగుతుందని, ఈ నెల 20వ తేదీ నుంచి తమ పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. వారికి వధూవరుల పేర్లు గల పుస్తకం అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్రవరపు శేషగిరిరావు, విజయకుమార్, ప్రసాదరావు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సమస్యలు వినండి సారూ..

పెద్దతిప్పసముద్రం: దళితుల సమస్యలు విని పరిష్కారం చూపాలని నేషనల్ హెల్ప్‌లైన్ అగేనిస్ట్ అట్రాసిటీ (ఎన్‌హెచ్‌ఏఏ) ఫీల్డ్ లెవల్ కౌన్సిలర్ కేవీ.రమణ డిమాండ్ చేశారు. విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడుతూ దళితులు ఎన్నో సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. దళితుల గళం వినిపించేందుకు ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశమే వేదిక అని, ఆ సమావేశం నిర్వహించకపోవడం చూస్తే దళితుల పట్ల ఉన్న చిత్తశుద్ధి అర్థమవుతోందన్నారు.

జిల్లా అభివృద్ధి కమిటీ సభ్యుడిగా నాగిరెడ్డి



బి.కొత్తకోట: జిల్లా అభివృద్ధి మరియు సమన్వయ కమిటీ సభ్యుడిగా మండలంలోని శీలంవారిపల్లె సర్పంచ్ బి.నాగిరెడ్డి నియమితులయ్యారు. కమిటీ చైర్మన్, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి సిఫార్సు మేరకు కలెక్టర్ అతడిని నియమించినట్లు తెలిసింది. ఈ నెల 9న సమావేశానికి హాజరుకావాలని అధికారులు నాగిరెడ్డికి సమాచారం పంపారు.

పారిశుద్ధ్య సిబ్బంది అప్రమత్తం


పనులు చేస్తున్న సిబ్బంది

బి.కొత్తకోట: గత ఆరు నెలలుగా హార్సిలీహిల్స్‌పై పారిశుద్ధ్యం అధ్వానంగా ఉన్నా పట్టని బి.కొత్తకోట నగరప పంచాయతీ పారిశుద్ధ్య యంత్రాంగం కరవు బృందం పర్యటిస్తోందని తెలియడంతో అప్రమత్తమైంది. నగర పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు ఆఘమేఘాలపై హార్సిలీహిల్స్ చేరుకుని యుద్ధ ప్రాతిపదికన కొండపై పారిశుద్ధ్య పనులు చేయించారు.

క్రీడా సామగ్రి విరాళం

బి.కొత్తకోట: స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థుల కోసం రూ.60 వేల విలువైన క్రీడా సామగ్రిని ఓ జ్యూవెలరీ సంస్థ ప్రతినిధులు మంగళవారం అందజేశారు. త్రోబాల్, క్యారం బోర్డు, వాలీబాల్, షటిల్ బ్యాట్స్, వాటికి సంబంధించిన నెట్లను అందజేసినట్లు హెచ్‌ఎం భాస్కర్ తెలిపారు.

కేసు నమోదు

మదనపల్లె: వృద్ధురాలిపై దాడి చేసిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదుచేసినట్లు తాలూకా ఎస్ఐ హరిహరప్రసాద్ తెలిపారు. మండలంలోని పెంచుపాడు పంచాయతీ గుట్టవారిపల్లెలో బంధువులు గొడవ పడుతుంటే పాపులమ్మ అడ్డుకునేందుకు ప్రయత్నించింది. స్థానికులు సోమశేఖర్, వెంకటేష్ భూవివాదం మనస్సులో ఉంచుకుని కక్ష పూరితంగా ఆమెపై కర్రలతో దాడికి పాల్పడ్డారు. పాపులమ్మ తీవ్రంగా గాయపడగా, స్థానికులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జాగ్రత్తలు పాటించాలి

తంబళ్లపల్లె: హెచ్‌ఎంపీవీ వైరస్‌పై అప్రమత్తంగా ఉంటూ ప్రతి ఒక్కరూ ముందస్తు జాగ్రత్తలు పాటించాలని వైద్యులు డాక్టర్ తేజస్వి, డాక్టర్ రిచర్డ్ పేర్కొన్నారు. సీహెచ్‌సీలో హెచ్‌ఎంపీవీ వైరస్‌పై మంగళవారం ప్రజలకు వారు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ జలుబు, దగ్గు, జ్వరం, నీరసం లక్షణాలు కనబడితే ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స పొందాలన్నారు. అనంతరం పీపీఈ కిట్ల వినియోగంపై శిక్షణ ఇచ్చారు.

గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేద్దాం


తరిగొండలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న చింతల రామచంద్రారెడ్డి

మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

గుర్రంకొండ: ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై కార్యకర్తలు, నాయకులు పోరాటం చేయాలని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని తరిగొండ గ్రామంలో కార్యకర్తలు, నాయకులతో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి పార్టీని పటిష్టం చేస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై నాయకులు, కార్యకర్తలు నిరంతరం పోరాడాలన్నారు. అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడుస్తున్నా ఒక్క సంక్షేమ పథకం ప్రజలకు అందకపోవడం దారుణమన్నారు. అమ్మ ఒడి, రైతు భరోసా పథకాలకు కూటమి ప్రభుత్వం ఈ ఏడాది మంగళం పాడిందన్నారు. ఎన్నో ఆశలతో ఓట్లు వేసిన రైతులకు ప్రభుత్వం ద్రోహం చేస్తోందన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఐదేళ్ల పాటు రైతులకు ఉచిత పంటల బీమా అందించామని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఆ భారాన్ని రైతులపై వేయడం దారుణమన్నారు.మహిళలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం తుంగలో తొక్కిందని, ఉచిత బస్సు ప్రయాణం గాల్లో కలిసిపోయిందన్నారు. సంవత్సరానికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఉత్తుత్తి పథకమేనని, చాలామంది మహిళల ఖాతాలో సిలిండర్ డబ్బు జమకాలేదనే విమర్శలు న్నాయన్నారు.సమ్రీన్ ముక్తియార్, ఎల్వీరమణ, అప్పల్ల, రౌనఖ్‌బాషా, కిరణ్‌కుమార్‌రెడ్డి, నగేష్, శేఖర్, సిఖిందర్, కాలేషా పాల్గొన్నారు.

రెఫరల్ కేసులు తగ్గించండి

మదనపల్లె: ప్రభుత్వ ఆస్పత్రి నుంచి రాత్రి వేళల్లో అత్యవసర కేసులు మినహా సాధారణ రెఫరల్ కేసులు తగ్గించాలని 108 ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ నాగభూషణం డిమాండ్ చేశారు. ఆస్పత్రిలోని ఛాంబర్‌లో ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ కోటేశ్వరిని ఆయన కలిసి సమస్యను తెలియజేశారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో సాధారణ కేసులను సైతం దూర ప్రాంతాలకు రెఫర్ చేస్తుండటంతో వారిని తీసుకెళ్లే క్రమంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఇటీవల జరిగిన రోడ్డుప్రమాదంలో 108 వాహనం ఢీకొని శ్రీవారి భక్తులు ముగ్గురు మృతి చెందడం బాధాకరమన్నారు. జశ్వంత్, రఫీ, సాంబ, సర్దార్, అమరనాథ, సూరి పాల్గొన్నారు.

అల్లుడిపై దాడి

మదనపల్లె: అల్లుడిపై అత్తింటి వారు దాడికి పాల్పడిన ఘటన మంగళవారం వాల్మీకిపురం మండలంలో జరిగింది. బాధితుడి వివరాల మేరకు.. నిమ్మనపల్లె మండలం బండ్లపై పంచాయతీ భూమలగడ్డకు చెందిన రవీంద్ర కుమారుడు సందీప్(25) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. ఇతడికి వాల్మీకిపురం మండలం చింతపర్తికి చెందిన జయంతితో రెండున్నరేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఒక కుమార్తె ఉంది. నాలుగునెలల క్రితం భార్యాభర్తల మధ్య విభేదాలతో జయంతి పుట్టినిల్లు చింతపర్తికి వెళ్లిపోయింది. అప్పటి నుంచీ సందీప్ పలుమార్లు కాపురానికి రావాలని అభ్యర్థించాడు. అయినా ఫలితం లేకపోవడంతో మంగళవారం చింతపర్తికి వెళ్లి భార్యతో మాట్లాడేందుకు ప్రయత్నించగా, అత్తింటికి చెందిన మామ రవి, అత్త అరుణ, భార్య జయంతిలు, సందీప్‌పై దాడికి పాల్పడ్డారు. మామ రవి కొడవలితో దాడిచేయగా సందీప్ చెవి తెగి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల సహాయంతో వాల్మీకిపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, ప్రాథమిక చికిత్స అనంతరం బాధితుడిని మెరుగైన వైద్యం కోసం మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేశారు. వాల్మీకిపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బకాయిలు చెల్లించాలని విద్యార్థుల నిరసన


యాచకుడికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పీలేరు: పెండిగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్, తల్లికి వందనం సొమ్ము వెంటనే విడుదల చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు టి.ఎల్.వెంకటేష్ ఏఐఎస్ఎఫ్ జిల్లా కారర్యదర్శి కె.మాధవకుమార్ డిమాండ్ చేశారు. పీలేరు పట్టణంలో మీరైనా రాష్ట్ర ప్రభుత్వానికి చందాలు ఇవ్వండి అంటూ యాచకుడికి వినతిపత్రం అందజేసి ఏఐఎస్ఎఫ్ నాయకులు వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రతి విద్యార్థికి రూ.15వేలు ఇస్తామని చెప్పి అనంతరం పట్టించుకోలేదన్నారు. యువగళం పాదయాత్ర సందర్భంగా రూ.6,800 కోట్లు ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లిస్తామని చెప్పిన నారా లోకేష అధికారంలోకి వచ్చిన తర్వాత అంత బడ్జెట్ లేదని మాట మార్చడం చేతగానితనానికి నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో భవిత, పునీత్, వినోద్, రెడ్డి గోవర్ధన్, సురేష్‌నాయుడు, కృష్ణ, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

12న కుల దహనం చైతన్య సభ

పీలేరు: భారతీయ అంబేడ్కర్ సేన(బాస్) 13వ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 12న మదనపల్లెలో నిర్వహించనున్న కుల దహనం చైతన్య సభను విజయవంతం చేయాని బాస్ జిల్లా కో కన్వీనర్ పాలకుంట శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానిక బాస్ కార్యాలయంలో మంగళవారం కుల దహనం చైతన్య సభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ సమస్యను జఠిలం చేసి అంబేడ్కర్ కుల నిర్మూలనా ఉద్యమాన్ని బీజేపీ తిరుగోమనం వైపునకు మళ్లించిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బాస్ నాయకులు ముల్లంగి కృష్ణయ్య, హరినాథ్, ఎర్రబల్లి మల్లికార్జున, గురవయ్య, రామకృష్ణ, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో దళితులపై దాడులు


మాట్లాడుతున్న యమలాసుదర్శనం

మదనపల్లె: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో దళితులపై దాడులు అధికమయ్యాయని మాల మహానాడు నాయకులు యమలా సుదర్శనం అన్నారు. స్థానిక మాలమహానాడు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ. అధికారంలోకి వస్తే దళితులకు రక్షణ కల్పిస్తామన్న చంద్రబాబు.. నేడు తన సొంత జిల్లాలో దాడులు జరుగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. మాదిగ యువకుడైన మొరవపల్లె రవి ఇంటిపై దాడిచేసి బెదిరించినా ఎలాంటి కేసు రిజిస్టర్ చేయలేదన్నారు. పుంగనూరు ఏఎస్ఐ తీరుకు నిరసనగా ఎస్టీ యువకుడు మురళీ నాయక్ ఆత్మహత్యాయత్నం చేశారన్నారు. నగరి మండలం తడపరతడకపాడు గ్రామానికి చెందిన దళితులపై టీడీపీ కార్యకర్తలు అమానుషంగా దాడిచేశారని, ఈ దాడిలో గాయపడిన 5 మంది యువకులు నేటికీ కనపడలేదన్నారు. నిందితులపై కేసు నమోదుచేయకపోగా, బాధిత దళితులపైనే కేసులు కట్టారన్నారు. గత ఏడాది సెప్టెంబర్ 2న కర్నూలు జిల్లా నాగనాథహరి గ్రామంలో గోవిందమ్మ నాలుగు ఎకరాల పొలం కొనుగోలు చేస్తే... పొలానికి ఆనుకుని ఉన్న రాఘవేంద్రరెడ్డి మాతోపాటు సేద్యం చేస్తావా అంటూ ట్రాక్టర్‌తో తొక్కించి చంపారన్నారు. చీరాల మండలం చీపురుగ్రామంలో దళిత యువతి బహిర్భూమికి వెళితే.. నలుగురు యువకులు గంజాయి మత్తులో అత్యాచారం చేసి ముక్కలుగా నరికారన్నారు. కర్నూలు జిల్లా పెద్దవడుగూరు మండలంలోని కల్లుకుంటలో మాదిగ గోవిందమ్మ కుమారుడు రజక కులానికి చెందిన యువతిని పెళ్లిచేసుకున్నందుకు మాదిగ మహిళను వివస్త్రను చేసి పోలీసుల సమక్షంలో భాధించినప్పటికీ రజకులపైనే కేసు పెట్టారన్నారు. ప్రతిరోజు రాష్ట్రంలో ఎక్కడో చోట దళితులపై దాడులు నిత్యకృత్యమయ్యాయన్నారు.

హార్సిలీహిల్స్‌లో కేంద్ర బృందం

బి.కొత్తకోట: చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో పర్యటించే కేంద్ర కరవు పరిశీలన బృందం హార్సిలీహిల్స్‌పై విడిది చేసింది. లైవ్‌స్టాక్ హెల్త్ అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ దీపాంకర్ సెత్, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ప్రదీప్‌కుమార్, మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ మన్నూజీ ఉపాధ్యాయలకు హార్సిలీహిల్స్‌పై బస ఏర్పాట్లు చేశారు. వారితోపాటు అన్నమయ్యజిల్లాలో పర్యటించే ఐదుగురు సభ్యుల బృందం ఇక్కడే విడిది చేసింది. బుధవారం ఉదయాన్నే చిత్తూరుజిల్లా బృందం హార్సిలీహిల్స్ నుంచి బయలుదేరి వెళ్లనుంది.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

మదనపల్లె: కారు, ఆటో ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో నలుగురు గాయాలపాలయ్యారు. మదనపల్లెకు చెందిన ఉపాధ్యాయులు శ్రీరాములు, జ్యోతి, ఉమామహేశ్వరి విధులకు హాజరయ్యేందుకు కారులో రామసముద్రానికి బయలుదేరారు. మార్గమధ్యంలో బొమ్మనచెరువు వద్ద ఎదురుగా వచ్చిన ఆటో కారును ఢీకొంది. ప్రమాదంలో ఉపాధ్యాయులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. బొమ్మనచెరువు పీహెచ్‌సీలో చికిత్స చేయించుకుని విధులకు హాజరయ్యారు. ప్రమాదంలో పెంచుపాడు పంచాయతీ పందివారిపల్లెకు చెందిన ఆటో డ్రైవర్ దామోదర్ (27) తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు బాధితుడిని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. కేసు విచారణ చేస్తున్నారు.

రైతు సేవా కేంద్రంలో శిలాఫలకం ధ్వంసం


శెట్టివారిపల్లె ఆర్బీకే భవనం శిలాఫలకం ధ్వంసం చేయడంతో నేలపై పడిన బండలు

గుర్రంకొండ: మండలంలోని శెట్టివారిపల్లె రైతు భరోసా కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని గుర్తుతెలియని దుండగులు మంగళవారం ధ్వంసం చేశారు. గ్రామంలో గత ఏడాది రూ.24 లక్షలతో రైతు భరోసా కేంద్రాన్ని నిర్మించారు. అప్పట్లో రైతులకు అన్ని సౌకర్యాలతో నిర్మించిన ఈ భవనాన్ని అప్పటి ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ప్రారంభించారు. సోమవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు ఆ శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. బండరాళ్లతో పగులగొట్టినట్లుగా ఆనవాళ్లు కనిపించాయి. ఉద్దేశ పూర్వకంగానే శిలాఫలకాన్ని ధ్వంసం చేశారనివైఎస్సార్‌సీపీ నాయకులు ఆరోపిస్తున్నారు.

వీల్‌చైర్ వితరణ

మదనపల్లె సిటీ: మదనపల్లె నియోజకవర్గ పరిధిలోని ఇద్దరు దివ్యాంగులకు మంగళవారం వీల్ ఛైర్లు అందజేశారు. స్థానిక అమ్మచెరువుమిట్టలోని వెలుగు పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో మదనపల్లె మండలం చిప్పిలికి చెందిన దివ్యాంగురాలు రమణమ్మ, కురబలకోటకు చెందిన బాబా ఫక్రుద్దీన్‌కు వీల్‌ఛైర్లు, బి.కొత్తకోటకు చెందిన ఓబులేసుకు చంక కర్రలు అందజేశారు. తంబళ్లపలల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ఆదేశాల మేరకు అందజేసినట్లు వెలుగు కార్యదర్శి ఉదయమోహన్ రెడ్డి తెలిపారు.

సర్వే నెంబర్లు తారుమారు చేశారని ఫిర్యాదు

గుర్రంకొండ: రెవెన్యూ రికార్డుల్లో తమ పొలాల సర్వే నెంబర్లు తారుమారు చేయడంతో ఇబ్బంది పడుతున్నామని తహసీల్దారు శ్రీనివాసులుకు రైతులు ఫిర్యాదు చేశారు. మండలంలోని ఖండ్రిగ గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతుల నంచి వినతులను స్వీకరించారు. గ్రామంలో ఏళ్ల తరబడి రెవెన్యూ రికార్డులో భూములున్నాయని, భూ సర్వే నిర్వహించిన అధికారులు సర్వే నెంబర్లు గోల్‌మాల్ చేశారన్నారు. కొందరు వాగు, వంకలు కబ్జా చేసి వ్యాపార సముదాయాలు నిర్మించుకున్నారని, చెరువులు, కుంటలకు వర్షపు నీరు చేరే మార్గాలు మూసుకుపోయాయని తెలిపారు. తహసీల్దారు స్పందిస్తూ సర్వే చేసి వెంటనే ఆక్రమణలు తొలగించి.. అక్కడ బోర్డులు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. లక్ష్మీపతి, రౌనఖ్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

పీలేరు రూరల్: రైతుల భూ సమస్యలను పరిష్కరించేందుకే అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తహసీల్దారు భీమేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని అగ్రహారం, ఎర్రగుంటపల్లె పంచాయతీలకు సంబంధించి అగ్రహారం లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులో 72 అర్జీలు వచ్చాయని, ప్రతి అర్జీని ఆన్‌లైన్ చేసి గడువులోపు పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్వేయర్ కిరణ్మయి, వీఆర్వో ఇమ్రాన్ పాల్గొన్నారు.

నేడు ఆదాయపు పన్ను శాఖ సదస్సు

మదనపల్లె: పట్టణంలోని రోటరీక్లబ్ భవనంలో ఆదాయపు పన్ను శాఖ ఆధ్వర్యంలో అవుట్ రీచ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అడ్వాన్స్ టాక్స్ ప్రాముఖ్యత, ఏఐఎస్ పోర్టల్ ద్వారా స్వచ్ఛంద సమ్మతి, ఐటీఆర్ ఇన్‌కరెక్ట్ క్లెయిమ్‌లు, డిడక్షన్స్, ఎగ్జెంప్షన్స్, వివాద్ సే విశ్వాస్ పథకం-2024కు సంబంధించిన ప్రత్యేకతలపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి పన్ను చెల్లింపు దారులు, చార్టర్డ్ అకౌంటెంట్లు, అధికారులు హాజరుకావాలని కోరారు.

పక్కాగా సర్వే నిర్వహించాలి

నిమ్మనపల్లె: పశు గణన సర్వే పక్కాగా నిర్వహించాలని మదనపల్లె డివిజన్ పశుసంవర్థక శాఖ ఉపసంచాలకులు(డిడి) డాక్టర్ కె.సత్యనారాయణ ఆదేశించారు. మండలంలోని పలు రైతు సేవా కేంద్రాలను స్థానిక పశు వైద్యాధికారి డాక్టర్ సురేష్‌తో కలిసి మంగళవారం తనిఖీ చేశారు. రిజిష్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాలలో పశుసంవర్థక శాఖ సహాయకులు రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. పశువులకు మెరుగైన వైద్యం అందించాలని, గడ్డిసాగును ప్రోత్సహించి, రాయితీ ఇవ్వాలన్నారు. నాటు కోళ్ల పెంపకం ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో ప్రతాప్, కాంతి, మునేంద్ర పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని పెయింటర్ దుర్మరణం


ప్రమాదంలో మృతి చెందిన నరేష్

మదనపల్లె: ద్విచక్ర వాహనాన్ని ట్రాక్టర్ ఢీకొని పెయింటర్ మృతిచెందిన సంఘటన మంగళవారం రాత్రి మదనపల్లె మండలంలో జరిగింది. రామాచార్లపల్లెకు చెందిన నరేష్(30) పెయింటర్గా పనిచేసస్తున్నాడు. ఇతడికి భార్య శశికళ ఇద్దరు కుమారులు ఉన్నారు. మంగళవారం తన స్నేహితులతో కలిసి ద్విచక్ర వాహనంలో మదనపల్లె పట్టణానికి వచ్చాడు. పనులు ముగించుకొని తిరిగి వెళ్తుండగా.. మార్గమధ్యంలో ఆంజనేయ స్వామి గుడి వద్ద ఎదురుగా వచ్చిన ఇసుక ట్రాక్టర్ ఢీకొంది. ప్రమాదంలో నరేష్ తీవ్రంగా గాయపడ్డారు. స్నేహితులకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో బాధితుడిని వెంటనే ఆస్పత్రికి తరలించారు. నరేష్ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.